దరఖాస్తుల ఆహ్వానం

కరీమాబాద్, జూన్ 16: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనింగ్ (ఎన్ఐఎఫ్‌డీ) హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అధికంగా ఉన్న ఫ్యాషన్, ఇంటీరియర్ డిజైనింగ్, ఫొటోగ్రఫీ వంటి వృత్తి విద్యా డిప్లొమా, డిగ్రీ అడ్వాన్స్ డిప్లొమా, పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం ఆర్థికంగా వెనుకబడి, ఆసక్తి ఉన్న వారు మెరిట్ స్కాలర్‌షిప్ టెస్టు ద్వారా ఫీజులో రాయితీ పొందొచ్చునని సంస్థ డైరెక్టర్ రాముయాదవ్ తెలిపారు. ఈ నెల 22, 23వ తేదీల్లో గ్రాండ్ మెరిట్ స్కాలర్‌షిప్ టెస్టు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 20లోగా 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని కోరారు. వివరాలకు www.nifdindia.in వెబ్‌సైట్ లేదా 9030610033, 9849167839 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నేడు విద్యుత్ ప్రజావాణి

నర్సంపేట, జూన్ 16: విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకు నర్సంపేట డివిజన్ పరిధిలో ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహించనున్నట్లు డీఈ శ్రీధర్ తెలిపారు. ఈఆర్వో, సబ్‌డివిజన్ ఆఫీసు, డివిజన్ కార్యాలయంలో ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తామని తెలిపారు. ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నిరసన తెలుపుతున్న మహిళా ప్రతినిధులు

'నిందితుడిని కఠినంగా శిక్షించాలి'

నర్సంపేట, జూన్ 16: పెద్దపెల్లి జిల్లాలోని ఓ రైస్‌మిల్లులో బాలికపై లైంగికదాడి చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ భారత జాతీయ మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు పాలక కవిత డిమాండ్ చేశారు. ఆదివారం ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ఆధ్వర్యంలో పట్టణంలో మహిళలు నిరసన తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. మమత, శైలజా, మంజుల, యశోద, అరుణ, ఫర్వీనా, దివ్య, అమూల్య, శారద పాల్గొన్నారు.

న్యాయం చేయాలి

కరీమాబాద్, జూన్ 16 : తనకు న్యాయం చేయాలని ఉర్సుకు చెందిన బలభద్ర నవత కోరింది. తనను అకారణంగా కొట్టిన అత్తగారి కుటుంబ సభ్యులపై పోలీసులకు ఫిర్యాదు చేశానని, కొన్ని రోజులుగా వారు పరారీలో ఉన్నారన్నారు. అప్పటి నుంచి తాను తల్లిగారి ఇంటి వద్దే ఉంటున్నట్లు చెప్పింది. దీంతో తనకు, తన పిల్లలకు ఇబ్బంది కరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేసింది. ఆదివారం తన అత్తగారి ఇంట్లోకి పిల్లలతో కలిసి వెళ్లింది. తనకు ఏం జరిగినా అత్తగారి బాధ్యతే అన్నారు.

అత్తగారి ఇంటి వద్ద పిల్లలతో నవత

తల్లీ కొడుకుపై దాడి

గీసుగొండ, జూన్ 16: తల్లీ కొడుకుపై ప్రియురాలి తండ్రి, సోదరులు దాడి చేసిన ఘటన వరంగల్ 16వ డివిజన్ కీర్తినగర్ కాలనీలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. కీర్తినగర్ కాలనీకి చెందిన యూసఫ్ షరీఫ్ కుమార్తె, అదే కాలనీలో ఉంటున్న అద్నాన్‌అలీ కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఈ క్రమంలో ఇరు కుటుంబాల మధ్య గతంలో అనేకసార్లు గొడవ జరిగింది. దీంతో యూసఫ్ షరీఫ్ తన కుటుంబంతో కలిసి హనుమకొండకు మకాం మార్చాడు. ఆదివారం మధ్యాహ్నం అద్నాన్‌అలీ హనుమకొండకు వెళ్లి ప్రియురాలితో గొడవపడి ఆమె ఫోన్‌ను తీసుకెళ్లాడు. విషయం తెలుసుకున్న యువతి కుటుంబ సభ్యులు కీర్తినగర్ కాలనీకి వచ్చి అద్నాన్‌అలీతో పాటు తల్లి సమీనాపై కత్తి, గొడ్డలితో దాడి చేశారు. వారు కేకలు వేయడంతో పారిపోయారు. వెంటనే స్థానికులు గమనించి బాధితులను 108 వాహనంలో ఎంజీఎం దవాఖానకు తరలించారు. ఎస్సై వెంకన్న ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. దాడి చేసిన వారు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

తల్లీకొడుకును దవాఖానకు తరలిస్తున్న స్థానికులు

ఇన్‌స్టాలో వేధింపులపై ఫిర్యాదు

కరీమాబాద్, జూన్ 16 : తనను, తన కుటుంబాన్ని ఇన్‌స్టాలో దుండగులు మెసేజ్‌లు పెట్టి, తిట్లతో వేధిస్తున్నారని, వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని శంభునిపేటకు చెందిన నీలం మానస ఆదివారం మిల్స్‌కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫేక్ ఐడీతో కొన్ని రోజులుగా తనను తిడుతూ మెసేజ్‌లు పెడుతున్నారని, రూ. 30 వేలు ఇస్తేనే మెసేజ్‌లు ఆపుతామని బెదిరిస్తున్నారని తెలిపింది. వారి వల్ల తాము ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేసింది. వారిని గుర్తించి దుండగులపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరింది.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు.
Cont: 9849145043.
NTW-318953

WANTED

jobs Apply Now!

★ Urgent Requirement for Corporate DSA Office Fresher & Exp. Female Tele-Callers, Quali: 12th & Best Talking Skills. Vacancies-30, Sal+Incentives etc., Job Location: HNK. Cont: 9032744373.
NTW-7701

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

ఓవర్ హెడ్ ట్యాంక్‌కు మోక్షమెప్పుడో..?

- రూ 3.50 కోట్లతో నిర్మాణం
- ట్రయల్ రన్ నిర్వహించినా ఫలితం శూన్యం
- అధికారుల మధ్య సమన్వయ లోపం
- తాగునీటికి ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ఖిలా వరంగల్, జూన్ 16: సమృద్ధిగా తాగునీరు అందించి ప్రజల కష్టాలను దూరం చేసేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. ఇంటింటికీ రక్షిత మంచినీరు అందించేందుకు కేసీఆర్ సర్కార్ విశేషంగా కృషి చేసింది. తాగునీటికి ఇబ్బందులు ఉన్న ప్రాంతాలను గుర్తించి ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణాలు చేసి, చివరి ఇంటికి కూడా తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంది. అయితే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు నెలల కాలంలో తాగునీటి సరఫరా లోపభూయిష్టంగా మారింది. లీకేజీలు ఒక సమస్య అయితే.. సంబంధిత అధికారుల మధ్య సమన్వయ లోపంతో ప్రజలకు తాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి నిర్మాణం పూర్తి చేసుకొన్న వాటర్ ట్యాంక్‌లను పట్టించుకోకపోవడంతో నీటి ఎద్దడి తలెత్తుతున్నది. ఇందుకు నిదర్శనం గ్రేటర్ వరంగల్ 36వ డివిజన్‌లో నిర్మాణం పూర్తి చేసుకున్న ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్. మూడేళ్ల క్రితం చారిత్రక నేపథ్యం కలిగిన ఓరుగల్లు కోటలోని 9వ డివిజన్‌లో 15 లక్షల లీటర్ల సామర్థ్యంతో ట్యాంక్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. అయితే, కేంద్ర పురావస్తు శాఖ అనుమతితో ఇదే డివిజన్‌లోని పుప్పాలగుట్టలో నాటి కార్పొరేటర్ సోమిశెట్టి శ్రీలత వాటర్ ట్యాంక్ పనులకు శంకుస్థాపన చేశారు.

నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్

పనులు జరుగుతున్న క్రమంలోనే అసెంబ్లీ ఎన్నికల కోడ్ వచ్చింది. ఈ ఎన్నికల ముందు డివిజన్ల పునర్విభజన చేయడంతో పుప్పాలగుట్ట 36వ డివిజన్ పరిధిలోకి వెళ్లింది. ట్యాంక్ నిర్మాణం పూర్తయితే చింతల్, ఖిలా వరంగల్, శివనగర్‌లోని పలు ప్రాంతాల్లోని తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కానుంది. రూ. 2.30 కోట్లతో నిర్మాణ పనులు మొదలు పెట్టినా నిధులు సరిపోకపోవడంతో అదనంగా రూ. 1.20 కోట్లను గత ప్రభుత్వం కేటాయించింది.

నీళ్లు ఇచ్చేదెప్పుడో..

పుప్పాలగుట్టలో నిర్మాణం పూర్తి చేసుకున్న ట్యాంక్ ప్రజలకు చుక్క నీరు ఇవ్వకుండా దిష్టిబొమ్మలా తయారైందని స్థానికులు వాపోతున్నారు. ట్రయల్ రన్ నిర్వహించినా వాటర్ ట్యాంక్‌లో నీరు నింపి ప్రజలకు సరఫరా చేయడంలో అధికారులు విఫలమయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. పుప్పాలగుట్టలో ప్రస్తుతం ఉన్న అధికార యంత్రాంగం పాత ట్యాంక్ ద్వారా నీళ్లు అందివ్వడంతో 11 రోజులుగా నీరు రావడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలయాపన చేస్తే జీడబ్ల్యూఎంసీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని మహిళలు హెచ్చరిస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే కష్టాలు

జీడబ్ల్యూఎంసీ అధికారుల నిర్లక్ష్యంతోనే శివనగర్, పుప్పాలగుట్ట ప్రాంతాలకు తాగునీటి సమస్య తలెత్తుతున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో కట్టించిన ఓవర్ హెడ్‌వాటర్‌ట్యాంక్‌ను ట్రయల్ రన్ చేసి వదిలేశారే తప్ప తాగునీరు సరఫరా చేయడం లేదు. పాత ట్యాంక్ ద్వారా కూడా నీళ్లు రావడం లేదు. ఫలితంగా 11 రోజులుగా స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

– సోమిశెట్టి ప్రవీణ్, 35వ డివిజన్ కార్పొరేటర్

కాంగ్రెస్ కార్యాలయ వివాదంపై దృష్టి

- ఇంతెజార్‌గంజ్ సీఐ, ఏసీపీ ఆరా
- నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

కాశీబుగ్గ, జూన్ 16: కాశీబుగ్గలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంపై పోలీసులు దృష్టి సారించారు. కాశీబుగ్గ ప్రాంతంలో శనివారం 'కాంగ్రెస్ కార్యాలయమా.. ప్రైవేట్ వ్యక్తుల ఆస్తా.. అంటూ ఫ్లెక్సీలు వెలిశాయి. ఈ మేరకు ఆదివారం నమస్తే తెలంగాణలో కథనం ప్రచురితమైంది. దీనిపై ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు ఆరా తీసి వివరాలు సేకరించినట్లు తెలిసింది. అలాగే, వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్‌తోపాటు ఇంతెజార్‌గంజ్ సీఐ మచ్చ శివకుమార్ ఫ్లెక్సీలు కట్టిన కాంగ్రెస్ కార్యకర్తలపై ఆరా తీసినట్లు సమాచారం. వెంటనే వారితో పాటు డివిజన్ ముఖ్య నాయకులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి వివరాలు సేకరించారు. షటర్లకు సంబంధించిన దస్తావేజులు, ఆదాయానికి సంబంధించిన వివరాలను సీఐ తెప్పించుకున్నట్లు తెలిసింది. అలాగే, ఏసీపీ పార్టీ నేతలతో మాట్లాడారు. షటర్ల విషయాన్ని మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లి సమస్య ను పరిష్కరించుకోవాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దని వారికి మంత్రి సూచించినట్లు తెలిసింది.

'చర్యలు తీసుకోవాలి'

ఐనవోలు, జూన్ 16: గోవధకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వీహెచ్‌పీ వరంగల్ జిల్లా ప్రతినిధి ఉదయ్ శ్రీరామ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఐనవోలు శివారులో సుమారు 40 ఆవులను నిర్బంధించి గోవధ శాలలకు తరలించడానికి సిద్ధం చేస్తుండగా వీహెచ్‌పీ, భజరంగదళ్ కార్యకర్తలు అక్కడికి చేరుకుని సీపీ, మామునూరు ఏసీపీ, ఐనవోలు ఎస్సైలకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. అలాగే, గోవధకు పాల్పడుతున్న వారిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు ఆయన వివరించారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

- నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

రాయపర్తి, జూన్ 16: మైలారం గ్రామంలోని 2వ వార్డులో తాగునీటి సమ స్య పరిష్కారానికి జీపీ ఉద్యోగులు, సిబ్బంది ఆదివారం చర్యలు చేపట్టారు. జీపీ కార్యాలయంలో శనివారం జరిగిన గ్రామసభలో 2వ వార్డులోని మహిళలు, గ్రామస్తులు తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేశారు. దీంతో 'తాగునీటి గోస పట్టదా..?' శీర్షికతో నమస్తే తెలంగాణలో కథనం ప్రచురితమైంది. స్పందించిన జీపీ సిబ్బంది పనులు చేపట్టారు. ప్రత్యేకాధికారి, ఎంపీడీవో గుగులోత్ కిషన్‌నాయక్, కార్యదర్శి పెంచల విజేందర్ ఆదేశాల మేరకు సిబ్బంది పైపులైన్‌ను పునరుద్ధరించారు.

పైపులైన్‌కు మరమ్మతు చేస్తున్న సిబ్బంది

ఊరిస్తూ ఉసూరుమనిపిస్తున్న మేఘాలు

- వరుణుడి కోసం రైతుల ఎదురుచూపు
- జూన్ రెండో వారం దాటినా కానరాని వైనం

నర్సంపేట, జూన్ 16 : వానకాలం సాగుకు సన్నద్ధమైన రైతులు వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. జూన్ రెండో వారం దాటినా తొలకరి జల్లులు అన్నదాతలను పలకరించలేదు. ఇటీవల కురిసిన వర్షం నర్సంపేట పట్టణానికే పరిమితమైంది. మబ్బులు కమ్ముకొస్తున్నా వర్షాలు మాత్రం పడడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో మురిపించిన వర్షాలు.. వానకాలం ప్రారంభం కాగానే మొహం చాటేశాయని వాపోతున్నారు. ఈ వేసవిలో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో చెరువులు, బావుల్లోనూ నీరు కరువైంది. తాగు, ఇతర అవసరాలకు కూడా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేసవిలో పడిన వర్షాలను చూసి రైతులు ముందస్తుగా విత్తనాలు వేయడంతో అవి మొలకెత్తక నష్టపోయారు. మళ్లీ విత్తనాలు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వరుణుడి కరుణ కోసం అన్నదాతలు వేయి కండ్లతో ఎదురుచూస్తున్నారు.

ఆకాశంలో కమ్ముకున్న నల్లని మబ్బులు

ప్రమాదకరంగా పాత భవనాలు

- పాములు, కోతులకు నిలయాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

కరీమాబాద్, జూన్ 16: అండర్ రైల్వేగేట్ ప్రాంతంలోని పాత భవనాలు, ఖాళీ స్థలాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఈ ప్రాంతంలో అనేక మిల్లులు, కార్ఖానాలు ఉండేవి. క్రమేపీ జన సంఖ్య పెరగడంతో ఇక్కడ ఇండ్ల నిర్మాణాలు పెరిగాయి. దీంతో ఆయా మిల్లులు, కార్ఖానాలు మూతబడ్డాయి. కానీ, వాటి కోసం కేటాయించిన స్థలాలు, నిర్మాణాలు అలాగే ఉన్నాయి. ప్రస్తుతం ఆ స్థలాల్లో చెట్లు పెరిగి పాములతో పాటు కోతులకు నిలయంగా మారాయి. శిథిలావస్థలో ఉన్న ఈ పాత భవనాలు ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. కరీమాబాద్‌లోని ప్రధాన రహదారి, ఎస్ఆర్ఆర్‌తోట, కరీమాబాద్ ప్రాంతాల్లోని కాలనీవాసులు ఆయా స్థలాల యజమానులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. వానకాలం ఆసన్నమైనందున ప్రమాదాలు జరుగక ముందే అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కలిమాబాద్‌లో ఇండ్ల మధ్యలో ఖాళీగా ఉన్న కార్ఖానా స్థలం

శిథిలావస్థకు చేరిన పాత భవనం

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కరీమాబాద్, జూన్ 16: పాఠశాలలో 39 ఏండ్ల క్రితం కలిసిమెలిసి చదువుకున్న విద్యార్థులంతా ఒకచోట చేరారు. సరదాగా ఆడిపాడి ఆనందంగా గడిపారు. చిన్నతనంలోని జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. గిర్మాజీపేట సరస్వతి ఉన్నత పాఠశాలకు చెందిన 1984-85 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఉర్సులోని తాళ్ల పద్మావతి కళాశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. కార్యక్రమంలో బిల్ల రవి, మాచన ప్రేమ్‌సాగర్, వెల్దండి సుధాకర్, బోడకుంట్ల సంపత్, వరయోగు శ్రీనివాస్, నాగుల జగన్, దాసరి రమేశ్, సాంబశివుడు, గౌస్, యాదగిరి, సుష్మ, వీణ, గీత, సుభాషిణి, పద్మ పాల్గొన్నారు.

ఏనుగల్లు ప్రభుత్వ పాఠశాలలో..

పర్వతగిరి: ఏనుగల్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 2002-2003 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఒకచోట చేరి నాటి గుర్తులను నెమరువేసుకున్నారు. అనంతరం గురువులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం గాయపు లింగారెడ్డి, నాటి హెచ్ఎం సమ్మయ్య, ఉపాధ్యాయులు దిలీప్, వసంత, రామ్మోహన్‌రావు, శ్యామ్, మూర్తి, పూర్వ విద్యార్థులు గూడ నరేందర్‌వర్మ, రమేశ్, భాస్కర్, రవి, రంజిత్, కల్పన, రేణుక, రాధిక, కవిత తదితరులు పాల్గొన్నారు.

కలిమాబాద్ : సమ్మేళనంలో పాల్గొన్న 1984-85 బ్యాచ్ విద్యార్థులు

పర్వతగిరి : సమ్మేళనంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉద్యోగులు

బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్

కరీమాబాద్, జూన్ 16: కలెక్టర్‌గా డాక్టర్ సత్యశారదాదేవి ఆదివారం కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన పలువురు ఉన్నతాధికారులు, ఉద్యోగులు ఆమెను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, కలెక్టర్‌ను జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సత్యశారదాదేవి జిల్లా అధికారులతో శాఖల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంటానని ఆమె చెప్పారు. అధికారులను సమన్వయం చేస్తూ జిల్లాను అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు.

వరంగల్ కలెక్టర్‌ను కలిసిన గ్రేటర్ కమిషనర్

వరంగల్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సత్య శారదాదేవిని గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదివారం కలెక్టర్ కార్యాలయంలో కలిసి పూల మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే హనుమకొండ కలెక్టర్‌గా బదిలీపై వెళ్తున్న ప్రావీణ్యకు పూలమొక్క అందజేసి అభినందనలు తెలిపారు.

కలెక్టర్‌కు పూలమొక్కను అందజేస్తున్న గ్రేటర్ కమిషనర్

భద్రకాళీని దర్శించుకున్న కలెక్టర్ సత్య శారదాదేవి

వరంగల్ : నగరంలోని ప్రసిద్ధ భద్రకాళీ ఆలయాన్ని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదాదేవి కుటుంబ సమేతంగా సందర్శించారు. ఆదివారం ఉదయం ఆలయానికి విచ్చేసిన ఆమెకు ఈవో శేషుభారతి, ప్రధాన అర్చకుడు భద్రకాళీ శేషు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ భద్రకాళీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు మహా మండపంలో ఆశీర్వచనం చేసి అమ్మవారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ, జూన్ 16 : హనుమకొండ జిల్లా నూతన కలెక్టర్‌గా పీ ప్రావీణ్య బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ కలెక్టర్‌గా పనిచేసిన సిక్తా పట్నాయక్ నారాయణపేట్‌కు బదిలీపై వెళ్లగా, వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను హనుమకొండ జిల్లాకు బదిలీ చేశారు. ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు హనుమకొండ కలెక్టరేట్‌కు చేరుకొని కలెక్టర్‌గా ప్రావీణ్య బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్‌ను అదనపు కలెక్టర్లు రాధికాగుప్తా, వెంకట్‌రెడ్డి, డీఆర్వో వైవీ గణేశ్, కలెక్టరేట్ ఏవో సత్యనారాయణ, అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రావీణ్య జిల్లా అధికారులతో కాసేపు ముచ్చటించారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రావీణ్య

నూతన కార్యవర్గం ఎన్నిక

ఖానాపురం, జూన్ 16: మండల కేంద్రానికి చెందిన మదర్ థెరిస్సా వీవో సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా తూడి ప్రభావతి, ఉపాధ్యక్షురాలిగా దేవినేని జ్యోతి, కార్యదర్శిగా జ్యోతుల వనజ, సహాయ కోశాధికారిగా నీలం లావణ్య, కోశాధికారిగా స్వప్న ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీసీ కరుణ, సీఏ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

చెన్నారావుపేట/గీసుగొండ, జూన్ 16: చెన్నారావుపేట మండలకేంద్రానికి చెందిన కుండె సమ్మక్క ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆదర్శ కాలనీ వాసులు ఆదివారం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి రూ. 11 వేల ఆర్థిక సాయం అందజేశారు. గీసుగొండ మండలంలోని ఊకల్‌కు చెందిన మండల సాంబయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి పారిశ్రామికవేత్త అల్లం బాలకిశోర్‌రెడ్డి రూ. 5 వేల ఆర్థిక సాయం అందించారు. అంతేకాకుండా మనుగొండకు చెందిన నల్ల సరోజన, మాదాసి స్వామి అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఫాదర్స్ డే సందర్భంగా గీసుగొండ ప్రభుత్వ పాఠశాలలో పని చేసి రిటైర్ అయిన ఉపాధ్యాయురాలు ముత్తినేని జయలక్ష్మి తన తండ్రి జ్ఞాపకార్థం రూ. 5 వేల ఆర్థిక సాయం అందించారు.

క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలి

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

హసన్‌పర్తి, జూన్ 16 : బాక్సింగ్‌లో క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. హసన్‌పర్తిలోని జడ్పీహెచ్ఎస్‌లో ఆదివారం నిర్వహించిన బాక్సింగ్ వేసవి శిక్షణ శిబిరం ముగింపు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులకు సర్టిఫికెట్‌లు అందజేసి మాట్లాడారు. క్రీడాకారులు కష్టపడితే జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించొచ్చన్నారు. బాక్సింగ్ క్రీడాపరికరాలను అందజేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో క్రీడా శిబిరం నిర్వహణకు ఆర్థికసాయం అందించిన నిరంజన్‌రెడ్డి, కనపర్తి కిరణ్, పావు శెట్టి, పృథ్వీరాజ్, చంద్రమోహన్, కోచ్ శీలం పార్థసారథి, జిల్లా బాక్సింగ్ సెక్రటరీ పెద్దమ్మ నర్సింహరాములు పాల్గొన్నారు.

చెస్ ఫైనల్ విజేతలకు జ్ఞాపికను అందజేస్తున్న ఈవో నాగేశ్వర్‌రావు, ప్రెస్ కమిటీ సభ్యులు

కొనసాగుతున్న జర్నలిస్టుల స్పోర్ట్స్

- వాలీబాల్ విన్నర్స్ వరంగల్ వారియర్స్ టీం
- చెస్ విజేత ఆడెపు మహేందర్

హనుమకొండ చౌరస్తా, జూన్ 16 : గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జర్నలిస్టుల స్పోర్ట్స్ మీట్ కొనసాగుతున్నది. వాలీబాల్, చెస్ పోటీలు ఆదివారం ముగిశాయి. జేఎన్ఎస్ గ్రౌండ్‌లో 4వ రోజు యంగ్ ఎలక్ట్రానిక్ మీడియా టీం, వీడియో జర్నలిస్టుల టీం మధ్య జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌కు ముఖ్యఅతిథిగా హాజరైన 10వ డివిజన్ కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లుకు గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, కమిటీ బాధ్యులు క్రీడాకారులను పరిచయం చేశారు. వాలీబాల్ పోటీల విజేతగా వరంగల్ వారియర్స్ టీం నిలిచింది. చెస్ ఫైనల్ పోటీలో హన్స్ ఇండియా బ్యూరో చీఫ్ ఆడెపు మహేందర్, బిగ్ టీవీ స్టాఫ్ రిపోర్టర్ వేణు గౌడ్ తలపడగా మహేందర్ గెలుపొందారు. క్రీడాకారులను ఐనవోలు దేవస్థానం ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు అభినందించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు పాల్గొన్నారు.